సాక్షి ప్రకాశం

శుక్రవారం । 22 । నవంబర్ । 2024



సర్పంచ్‌ల పవర్‌కు చెక్..

కూటమి ప్రభుత్వం సర్పంచ్‌ల అధికారానికి చెక్ పెట్టింది. గ్రామాల్లో చేసే పనులకు సర్పంచ్‌లతో సంబంధం లేకుండా చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. - 8లో..



సైబర్ నేరాలపై అప్రమత్తంగా వ్యవహరించాలి

సైబర్ నేరాలపై గ్రామ, వార్డు స్థాయిలో మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
30/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు త్రోబాల్ జిల్లా జట్ల ఎంపికలు

దర్శి: చందలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉమ్మడి జిల్లాల త్రోబాల్ అండర్-14, అండర్-17 జిల్లా జట్ల ఎంపికలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎండీ హాజీరాబేగం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జరిగే కార్యక్రమానికి పీడీలు, పీఈటీలు హాజరు కావాలని కోరారు.

మహిళ కడుపులో 7 కిలోల కణితి తొలగింపు

ఒంగోలు టౌన్: నగరంలోని శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఒక మహిళ కడుపులో నుంచి 7 కిలోల కణితిని తొలగించారు. గురువారం ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హాస్పిటల్ మేనేజ్‌మెంట్ డైరక్టర్ డా.చాపల వంశీకృష్ణ వివరాలు వెల్లడించారు. దర్శి ప్రాంతానికి చెందిన మహిళ ఒకరు కొంతకాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోంది. ఇటీవల నగరంలోని శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చికిత్స కోసం వచ్చారు. ప్రసూతి, గర్భకోశ వ్యాధుల నిపుణులు డా.చాపల శాంత కుమారిని సంప్రదించారు. అల్ట్రా సౌండ్ తదితర పరీక్షలు నిర్వహించగా ఆమె కడుపులో పెద్ద కణితి ఉన్నట్లు నిర్ధారించారు. వెంటనే ఆపరేషన్ చేసి కణితిని తొలగించి ప్రాణాలను రక్షించారు. ఆపరేషన్ చేసి తొలగించిన కణితి 7 కిలోల బరువు ఉంది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.



మహిళకు ఆపరేషన్ చేసి కణితిని తొలగించిన వైద్యురాలు శాంతకుమారి

ఆపదలో ఆపద్బాంధవి

ఆపదలో ఉన్న వారికి అత్యవసర వైద్యం కోసం ఠక్కున గుర్తుకొచ్చే ఆపద్బాంధవి 108కే ఆపద ఎదురైంది. ఓ వైపు సిబ్బంది కొరత వేధిస్తుండగా మరో వైపు ఉన్న వారికీ జీతాలు సక్రమంగా రావడం లేదు. సిబ్బంది లేరన్న సాకుతో సెలవులు లేక ఉద్యోగులు తీవ్ర పనిఒత్తిడికి గురవుతున్నారు. తమ సమస్యలను పరిష్కరించి 108 సర్వీసులను గాడిలో పెట్టాలని ఉద్యోగులు నిరసన తెలిపినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. దీంతో వారు సమ్మె బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు.

- సిబ్బంది కొరతతో ఇబ్బంది పడుతున్న 108
- జీతాలు సక్రమంగా రాకపోవడంతో ఉద్యోగులకు తప్పని తిప్పలు
- సెలవులు లేక ఒత్తిడికి గురవుతున్న ఉద్యోగులు
- ప్రభుత్వమే 108ను నిర్వహించాలని విన్నపం
- 108 ఉద్యోగుల సమస్యలను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- 25 తరువాత సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయం



పాత రిమ్స్‌లో మూలనపడిన 108 వాహనాలు

ఒంగోలు టౌన్: 108.. ఈ పేరు వింటేనే చాలు ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు కుయ్ కుయ్ మంటూ వచ్చే అంబులెన్స్ కళ్ల ముందు కదలాడుతుంది. ఎక్కడైనా సరే...ఎవరికైనా సరే ...ఎలాంటి ప్రమాదం ఏర్పడినా, అత్యవసర ఆరోగ్య సమస్య తలెత్తినా వెంటనే 108కు ఫోన్ చేయడం గత 20 ఏళ్లుగా రాష్ట్ర ప్రజలకు అలవాటైపోయింది. ముఖ్యంగా నిరుపేద సామాన్య ప్రజలకు 108 ఇచ్చిన భరోసా అంతా ఇంతా కాదు. అలాంటి 108 ఇప్పుడు సమస్యల సుడిగుండంలో పడిపోయింది. ఒకవైపు సిబ్బంది కొరత వేధిస్తుంటే మరోవైపు సకాలంలో వేతనాలు రాక సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారు. స్కీంలో భాగంగా అరబిందో ఉద్యోగులుగా పరిగణించబడుతున్న వీరికి రావాల్సిన బకాయిల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ఇక వేల కిలో మీటర్లు తిరిగిన వాహనాలు కుయ్యో మొర్రో అని మొరాయిస్తుంటే భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. సెలవులు లేక మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇలా 108 ఉద్యోగులను కదిలిస్తే ఎన్నో సమస్యలు... మరెన్నో ఇబ్బందులు చెబుతున్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి మాత్రం ఇవేవీ పట్టించుకునే తీరిక లేదు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలన్న బాధ్యత మరిచి రాజకీయాలకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తోంది. సిబ్బంది సమస్యలను వదిలేసి అరబిందో వెనకబడింది. దాంతో 108 ఉద్యోగులు మరింతగా సమస్యల్లో కూరుకుని పోయారు. ఈ నేపథ్యంలో గత సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తమ సమస్యలను పరిష్కరించాల్సిందిగా వేడుకున్నాడు. అయినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉలుకు లేదు పలుకు లేదు. సహనం నశించిన ఉద్యోగులు ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.

38 మండలాలు...40 వాహనాలు:

జిల్లాలో 38 మండలాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 40 నూటెనిమిది వాహనాలు ప్రజలకు అత్యవసర సేవలు అందిస్తున్నాయి. మండలానికి ఒకటి చొప్పున 38 వాహనాలు ఉండగా మార్కాపురంలో నవజాత శిశువులు అత్యవసర సేవల కోసం అప్పటి ప్రభుత్వం ఒక వాహనాన్ని కేటాయించింది. సాధారణ ఎన్నికలకు ముందు గిరిజన ప్రాంతాల ప్రజల కోసం ప్రత్యేకంగా ఒక వాహనాన్ని కేటాయించారు. దాంతో మొత్తం 40 వాహనాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం 35 వాహనాలు పనిచేస్తుండగా 5 వాహనాలకు మాత్రం మరమ్మతులు జరుగుతున్నాయి. 2023లో అప్పటి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం 14 కొత్త వాహనాలను జిల్లాకు కేటాయించింది. లేకపోతే పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉండేది. ప్రతి అంబులెన్స్‌లోనూ 2.5 రేషియో ప్రకారం ఒక ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ఒక పైలట్ ఉంటారు. జిల్లాలో 200 మంది సిబ్బందికి గాను 185 మంది మాత్రమే ఉన్నారు. వారిలో 95 మంది ఈఎంటీలు కాగా, 90 మంది పైలట్లు ఉన్నారు. 8 మంది పైలట్లు, ఏడుగురు ఈఎంటీ సిబ్బంది అవసరం ఉంది.

సెలవులు లేక ఒత్తిడికి గురవుతున్న ఉద్యోగులు...

జిల్లాలో 108లో సిబ్బంది కొరత వేధిస్తోంది. రోజుకు 12 గంటలు పనిచేయాల్సి ఉంటుంది. లేబర్ యాక్టు ప్రకారం 48 గంటలకు ఒక వీకాఫ్ ఇవ్వాల్సి ఉంది. సిబ్బంది కొరతతో 96 గంటలకు ఒకరోజు సెలవు ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. నిజానికి సిబ్బంది లేరన్న సాకులు చెబుతూ సెలవులు ఇవ్వడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ఒకవేళ ఎవరైనా అత్యవసర పనుల మీద సెలవు పెట్టాలంటే తనకు బదులుగా మరొకరిని చూపిస్తేనే కానీ సెలవులు ఇవ్వడం లేదని చెబుతున్నారు.

రిఫర్ కేసులకు ప్రాధాన్యత...

జిల్లాలో ప్రత్యేక పరిస్థితులు కనిపిస్తున్నాయి. జిల్లా కేంద్రమైన ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తీసుకొచ్చిన కేసులను గుంటూరుకు రెఫర్ చేస్తారు. దాంతో వారిని 108 వాహనంలో గుంటూరు తీసుకెళ్తున్నారు. ఇది అత్యవసర సేవలకు ఇబ్బందిగా మారిందని 108 ఉద్యోగులు చెబుతున్నారు. నిజానికి రోడ్డు ప్రమాదాలు, గుండెపోటు, కాన్పులు, పాముకాటు, తేలుకాటు, క్రిమి సంహారక మందులు తీసుకొని ఆత్మహత్యా ప్రయత్నాలు చేసినప్పుడు వారిని అత్యవసరంగా ఆస్పత్రికి తరలించడం 108 లక్ష్యం. ఇప్పుడు అందుకు విరుద్ధంగా జరుగుతోంది. కిడ్నీ డయాలసిస్ రోగులను తీసుకొచ్చి, తిరిగి ఇంటి దగ్గర వదిలి పెట్టి రావడం, ఇతర చిన్న చితకా కేసుల్లో గుంటూరుకు రోగులను తీసుకెళ్లడం లాంటి పనులకు 108 ను వినియోగించడం వలన అత్యవసర సమయంలో ఏదైనా ఫోను వచ్చినా, ఏమీ చేయలేని పరిస్థితులు నెలకొంటున్నాయని పైలట్లు చెబుతున్నారు. ప్రతి రోజూ ఒంగోలు జీజీహెచ్ నుంచి గుంటూరుకు కేసులను వైద్యులు రెఫర్ చేస్తున్నారు. ఏ మాత్రం క్రిటికల్ కేసులు వచ్చినా గుంటూరుకు రెఫర్ రాసేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. అలాగే మార్కాపురం, కనిగిరి, యర్రగొండపాలెం, గిద్దలూరు నుంచి ఒంగోలుకు రెఫర్ చేస్తున్నట్లు సమాచారం. దానివలన ప్రాణాపాయంలో ఉన్న ఇతర రోగులకు అంబులెన్సు అందుబాటులో లేకుండా పోతోంది. జీజీహెచ్ అధికారులు ఈ విషయం మీద తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అడ్రసు లేకుండా పోతున్న 108 వాహనాలు

ప్రమాదం జరిగిన వ్యక్తిని కానీ, గుండెపోటు లాంటివి వచ్చిన వ్యక్తిని కానీ సాధ్యమైనంత త్వరగా ఆస్పత్రికి చేర్చాలి. అప్పుడే బాధితుడు బతికే అవకాశాలు మెరుగుపడతాయి. స్వతహాగా వైద్యుడైన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఈ పరిస్థితిని గమనించి 108 అత్యవసర సేవలకు రూపకల్పన చేశారు. లక్షల మంది ప్రాణాలను 108 వాహనాలు కాపాడుతున్నాయి. అయితే ఇప్పుడా పరిస్థితి మారింది. అత్యవసర సమయంలో ఫోన్లు చేస్తే 108 వాహనాలు అందుబాటులో ఉండడం లేదు. కొన్ని చోట్ల చాలా ఆలస్యంగా వస్తున్నాయి. అప్పటికే సమయం మించిపోతుంది. బాధితులు ప్రాణాలు కోల్పోతారు. అందుకే ఇప్పుడు 108 వాహనాల కోసం ఎదురు చూడడం మాని ప్రైవేటు వాహనాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అత్యవసరమైతే ఆటోల్లో బాధితులను ఆస్పత్రికి తరలిస్తున్నారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వలన 108 కునికిపాట్లు పడుతుందని ప్రజలు విమర్శిస్తున్నారు.

సమ్మె బాటలో 108 ఉద్యోగులు

108 సర్వీసులోని ఉద్యోగులను వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులుగా గుర్తించాలని, 108ను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతున్నారు. పీఎఫ్, ఎర్న్‌డ్ లీవులకు సంబంధించి బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, వార్షిక ఇంక్రిమెంట్లు చెల్లించాలని కోరుతున్నారు. ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, వైద్య ఆరోగ్య శాఖలో చేపట్టే నియామకాల్లో వెయిటేజీ మార్కులు ఇచ్చి 108 ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు. ఈ సమస్యల సాధన కోసం ఉద్యమాలకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న 108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో ఈ నెల 24 లోపు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే 25వ తేదీ తరువాత ఏ క్షణంలోనైనా సమ్మెలోకి వెళ్లాలని 108 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నిర్ణయించింది. ఈ మేరకు అధికారులకు ముందస్తు నోటీసులు అందజేశారు.



సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ (ఫైల్)

108 ఉద్యోగుల చేత వెట్టిచాకిరి చేయించడం దారుణం



108 ఉద్యోగుల చేత వెట్టి చాకిరి చేయిస్తున్నారు. కార్మిక చట్టాల ప్రకారం రోజుకు 8 గంటలు మాత్రమే పని చేయాల్సి ఉంది. కానీ 108లో మాత్రం 12 గంటలు పని చేయిస్తున్నారు. అదనపు పనికి ఎలాంటి అదనపు వేతనం కూడా చెల్లించకపోవడం దుర్మార్గం. కార్మికుల దగ్గర నుంచి పీఎఫ్, ఈఎస్ఐ తాలుకు సొమ్మును వసూలు చేయడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలి. రాష్ట్రంలో వందలాది సంస్థలను నిర్వహిస్తున్న ప్రభుత్వానికి 108 ను నిర్వహించడం ఒక లెక్కలోనిది కాదు. సొంత వ్యక్తులకు సంపాదించి పెట్టడం కోసమే ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతున్నారు. దానికి బదులుగా ప్రభుత్వమే 108ను నిర్వహించాలి.

– వెన్నా గాలిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, 108 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్

వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు





మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన వైవీ సుబ్బారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, చుండూరి రవిబాబు, కఠారి శంకర్, కాకుమాని రాజశేఖర్, కుప్పం ప్రసాద్, జెడ్పీటీసీలు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ని తాడేపల్లిలో జిల్లాకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు కలిశారు. రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, లిడ్ క్యాప్ మాజీ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, జెడ్పీటీసీ సైకం లక్ష్మీశారద, ఆళ్ల రవీంద్రారెడ్డి, సైకం రాంబాబు, కార్పొరేటర్లు వెన్నపూస కుమారి, ఇమ్రాన్‌ఖాన్, ప్రవీణ్ కుమార్, పార్టీ నాయకుడు వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి, కో ఆప్షన్ మెంబర్లు ఎస్కే.రషీదా, ఎస్కే నాగుర్, శ్యాంసాగర్, పార్టీ నాయకులు కఠారి ప్రసాద్, చావలి శివప్రసాద్, పి.సురేష్, బి.రవణమ్మ, పుల్లయ్య, వెంకటరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఒంగోలు నియోజకవర్గంలోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన బూచేపల్లి

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తాడేపల్లిలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో పార్టీ స్థితిగతులపై చర్చించారు.

మత్స్యకారుల ఉపాధి మెరుగుపరిచేలా చర్యలు

- తుఫాన్ బాధితులను ఆదుకోవడంలో మత్స్యకారుల సహకారం మరువలేనిది
- మత్స్యకార దినోత్సవంలో ఎంపీ మాగుంట, కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: మత్స్యకారుల సంక్షేమంతో పాటు వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడటం, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా గురువారం ప్రకాశం భవనంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దీనిలో ఎంపీ, కలెక్టర్‌తో పాటు మేయర్ సుజాత, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు. దీనిలో వక్తలు మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్‌లు ఏర్పాటు చేయడం వల్ల మత్స్యకార గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. చేపల ఉత్పత్తిలో దేశంలో 29.1 శాతం వాటాతో మన రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విజయవాడలో వచ్చిన వరదల సమయంలో చెప్పిన వెంటన 35 బోట్లతో 75 మంది మత్స్యకారులు విజయవాడకు వెళ్లి వారంపాటు వరద సహాయక చర్యల్లో పాల్గొనటం అభినందనీయమన్నారు. వారి సహకారం మరువలేనిదని అదే స్ఫూర్తితో ఎప్పుడూ ప్రజలకు సేవలు అవసరమైనా అందించాలని కోరారు. తమిళనాడు నుంచి వస్తున్న సోనా బోట్ల సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లామన్నారు. కొత్తపట్నం, పాకల బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మత్స్యకారులు వారు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరారు. వరదల్లో సహాయక చర్యల్లో పాల్గొన్న మత్స్యకారులను సత్కరించారు. కార్యక్రమంలో మత్స్యకారులతో పాటు పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అత్యాచారాలు అరికట్టడంలో పాలకుల వైఫల్యం

- విశాఖ లా విద్యార్థినిపై అత్యాచారాన్ని ఖండిస్తూ నిరసన



విశాఖ ఘటనను నిరసిస్తూ ప్రదర్శన నిర్వహిస్తున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు విఫలమయ్యారని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి విమర్శించారు. విశాఖలో లా విద్యార్థినిపై జరిగిన లైంగికదాడిని ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ, ఐద్వాల ఆధ్వర్యంలో సాయిబాబా గుడి సెంటర్, ప్రకాశం పంతులు విగ్రహం వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. కలకత్తా ట్రైనీ డాక్టర్‌పై జరిగిన లైంగిక దాడి ఘటన మరవక ముందే లా విద్యార్థినిపై క్రూరమైన దాడి చేయడం అమానుషం అన్నారు. విశాఖ ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వరసగా జరుగుతున్న దాడుల్లో మహిళలు బలి పశువులుగా మారారని, ఈ ఘటనల మీద అధికార టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. రాష్ట్రంలో గంజాయి, మద్యం ఏరులై పారుతోందని, విచ్చలవిడిగా మత్తు పదార్థాలను చెలామణి చేయడం వలన యువత మత్తుకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తుకు బానిసలై మహిళలపై పాశవికంగా లైంగిక దాడులకు పాల్పడుతున్నారని, వాటిని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలకు రక్షణ కల్పిస్తామన్న కూటమి మాటలు గాలిలో కలిసిపోయాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ విమర్శించారు. పోర్న్ వెబ్‌సైట్లను నిషేధించాలని, పోక్సో చట్టం ద్వారా విచారణ చేపట్టాలని, జస్టిస్ వర్మ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు మాలతి, నాగుర్, ఆదిలక్ష్మి, గోవిందమ్మ, పెద గోవిందమ్మ, ఎస్ఎఫ్ఐ నాయకుల విజయ్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో రాజీ ప్రయత్నాలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు తాలూకా పోలీసు కానిస్టేబుల్ శ్రీనివాసరావుపై దాడి కేసులో పలువురు రాజకీయ ప్రముఖులు రంగప్రవేశం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. నిందితుడు బోడెపూడి రాంబాబుకు మద్దతుగా ఇద్దరు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు రాజీ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే పోలీసు కానిస్టేబుల్ శ్రీనివాసరావుపై దాడి చేసి తీవ్రంగా కొట్టిన నిందితుడిని అరెస్టు చేసేందుకు పోలీసులు తాత్సారం చేస్తున్నట్లు పోలీసు శాఖలోని కొందరు ఉద్యోగులు చెవులు కొరుక్కుంటున్నారు. నిందితుడు అధికార పార్టీకి చెందిన నాయకుడు కావడమే కాకుండా అధికార పార్టీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం వల్లనే చర్యలు తీసుకునేందుకు మల్లగుల్లాలు పడుతున్నారని విమర్శిస్తున్నారు. చిన్న చిన్న కేసుల్లో నిందితులను పట్టుకొని కేసులు పెడుతున్న పోలీసులు.. ఏకంగా ఓ పోలీసునే నడిరోడ్డుపై కొట్టిన కేసులో ఇప్పటి వరకు ఎందుకు అరెస్టు చేయలేదో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టారని కేసులు పెట్టి ఎక్కడున్నా సరే పట్టుకొచ్చి విచారణ పేరుతో వేధిస్తున్న పోలీసులు సొంత శాఖలో పనిచేస్తున్న కానిస్టేబుల్‌పై దాడి చేసిన నిందితుడి విషయంలో మాత్రం అధికార పార్టీ ఎమ్మెల్యేల ఒత్తిడికి తలొంచడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానిస్టేబుల్ శ్రీనివాసరావును అకారణంగా కొట్టడమే కాకుండా చేయి కొరికి, కారును పైకి దూకించి హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడి పట్ల మెతకవైఖరి అవలంబించడం సరైన నిర్ణయం కాదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా నిందితుడు గతంలో కూడా పలువురిపై ఇలాగే దాడులకు పాల్పడిన ఘటనలు ఉన్నాయని తెలుస్తోంది. దుందుడుకు స్వభావం కలిగిన నిందితుడిపై తగిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఫిషరీస్ రంగంలో అగ్రగామిగా ఉండటం సంతోషం

- ఏకేయూ వీసీ డి.వి.ఆర్.మూర్తి



ఫుడ్ డివిజన్ మేనేజరు అన్సారిని సన్మానించిన వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు సిటీ: ఫిషరీస్ రంగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలవడం సంతోషకరమని ఏకేయూ వైస్ ఛాన్సలర్ డి.వి.ఆర్.మూర్తి అన్నారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీలో ప్రపంచ మత్స్యకార దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఏకేయూ ఆక్వాకల్చర్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీ ప్రొఫెసర్ బి.హరిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీసీ మూర్తి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజలు వ్యవసాయ రంగంతో పాటు చేపల పెంపకం, రొయ్యల పెంపకం వంటి వాటికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నందున గుజరాత్ కంటే మన రాష్ట్రం ఆక్వాసాగులో అధికంగా ఉందన్నారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు మాట్లాడుతూ ఆక్వాసాగు అధికంగా సాగు చేయడానికి ప్రధాన కారణం కోస్తా తీర ప్రాంతం వాతావరణం దృష్ట్యా మంచి వసతులు ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ఆంధ్రకేసరి యూనివర్సిటీలో ఆక్వాకల్చర్ డిపార్టుమెంట్ ను బాగా అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆక్వా కల్చర్ డిపార్టుమెంట్ ద్వారా జాతీయ స్థాయిలో సెమినార్లు నిర్వహించి అధ్యాపకులకు, విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తారన్నారు. వీసీ మూర్తి, రిజిస్ట్రార్ బి.హరిబాబు దేవి సీఫుడ్స్ ఫుడ్ డివిజన్ మేనేజరు అన్సారితో పాటు పలువురిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహనరావు, ఆక్వాకల్చర్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు డాక్టర్ బి.సురేష్, డాక్టర్ అశ్వర్ధనారాయణ, మార్కెటింగ్ విభాగం మేనేజరు ఎం.నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

24న కబడ్డీ జట్ల ఎంపిక

ఒంగోలు: జిల్లా స్త్రీ, పురుష కబడ్డీ జట్ల ఎంపిక ఈ నెల 24న స్థానిక డాక్టర్ పర్వతరెడ్డి ఆనంద్ మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కుర్రా భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మ్యాట్‌పై ఎంపిక జరుగుతుందని, ఆసక్తి ఉన్న వారు నేరుగా ఎంపికకు హాజరుకావాలన్నారు. పురుషుల విభాగంలో 85 కేజీల లోపు, మహిళల విభాగంలో 75 కేజీల లోపు బరువు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన జట్లు త్వరలో సంతనూతలపాడులో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి పూర్ణచంద్రరావు 9948343232, 7780497696 నంబర్లను సంప్రదించాలని కోరారు.

24న స్విమ్మింగ్ జిల్లా జట్ల ఎంపిక

ఒంగోలు: సబ్ జూనియర్, జూనియర్ స్విమ్మింగ్ జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 24న నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా అమెచ్యూర్ అక్వాటిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.చంద్రశేఖరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నెక్ట్స్ జెన్ ఇంటర్నేషనల్ స్కూలు ఆవరణలో ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ వయస్సు ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో నేరుగా రిపోర్టు చేయాలన్నారు. ఫ్రీస్టైల్ 50మీ, 100మీ, 200మీ, బ్యాక్ స్ట్రోక్ 50మీ, 100మీటర్లు, బ్రెస్ట్ స్ట్రోక్ 50మీ, 100 మీటర్లు, బటర్ ఫ్లై 50మీటర్లు, 100 మీటర్లు ఈవెంట్స్‌లో ఎంపిక ఉంటుందని, ఎంపికైన వారు డిసెంబర్ 7,8 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన మైనంపాడు విద్యార్థులు

సంతనూతలపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4 , 5 తేదీల్లో పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో జరిగిన అండర్ 17 రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాల విద్యార్థులు టి.శృతి, కె.చరణ్‌కుమార్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు డీవీఎల్ నరసింహారావు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22 నుంచి 27 వరకు హర్యానాలో జరగనున్న జాతీయస్థాయి హాకీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని పీఈటీ తిరుమలశెట్టి రవికుమార్ తెలిపారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, పీడీ కె.వనజ, సిబ్బంది పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులను హాకీ క్లబ్ మైనంపాడు సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

24న కార్తీక వనభోజనాలు

ఒంగోలు వన్‌టౌన్: రెడ్డి జనాభ్యుదయ సంఘ కార్తీక వనభోజనాలను ఈ నెల 24న కందుల ఓబుల్ రెడ్డి రిజర్వాయర్, మల్లవరం డ్యాం, గుండ్లాపల్లి వద్ద ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహక సభ్యులు గుడిపాటి చంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఒంగోలులోని రెడ్డి హాస్టల్‌లో కార్యక్రమ నిర్వహణ కమిటీ సభ్యుల సమావేశం గురువారం నిర్వహించారు. లింగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 2012 నుంచి కార్తీక వనభోజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సప్త హోమాల కార్యక్రమంలో పాల్గొనే దంపతులు ముందుగా 9440265670 అనే నంబరుకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బొమ్మిరెడ్డి రాఘవరెడ్డి, వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సర్పంచ్‌ల పవర్‌కు చెక్..!

కూటమి ప్రభుత్వం సర్పంచ్‌ల అధికారానికి చెక్ పెట్టింది. గ్రామాల్లో చేసే పనులను సర్పంచ్‌లకు సంబంధం లేకుండా కేటాయించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలోకి రాక ముందు సర్పంచ్‌లపై అలివిమాలిన ప్రేమ కురిపించిన చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లు.. అధికారంలోకి రాగానే సర్పంచ్‌ల ఉన్న అధికారాలను చెక్ పెట్టడంపై వారు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

- సర్పంచ్‌లకు సంబంధం లేకుండా పనుల కేటాయింపు
- అధికార పార్టీ తీరుతో సర్పంచ్‌లు ఇక్కట్లు
- పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం
- వెండర్‌కు ఎన్ఆర్ఈజీఎస్ పనులు కట్టబెట్టిన వైనం



బేస్తవారిపేటలో మెయిన్‌రోడ్డు దుస్థితి

బేస్తవారిపేట:

ఎన్నికల సమయంలో గ్రామ స్వరాజ్యం తీసుకువస్తామని గొప్పలు చెప్పుకున్న కూటమి ప్రభుత్వం..ఆచరణలో చతికల పడుతోంది. ఇప్పటికే గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సచివాలయాల వ్యవస్థను నిర్వీర్యం చేశారు. ఇప్పుడు గ్రామస్థాయిలో సర్పంచ్‌లపై చిన్నచూపు చూస్తున్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టే పనులను సర్పంచ్‌లు, కార్యదర్శులకు సంబంధం లేకుండా వెండర్ల ద్వారా నగదు చెల్లింపులు చేస్తూ కొత్త దందాకు తెరలేపింది. పనులు మొత్తాన్ని గుత్తాధిపత్యంగా కేటాయించి వారి నుంచి సొమ్ము చేసుకునేందుకు ఈ ఘనకార్యానికి ఒడిగట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇక్కడ పనులు..అక్కడి వారితోనా..?

గిద్దలూరు నియోజకవర్గంలో ఆరు మండలాల్లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంలో సీసీరోడ్ల నిర్మాణానికి ఒక్కో మండలానికి రూ.2.5 కోట్లు మంజూరయ్యాయి. గ్రామ సభలో తీర్మానం చేసి పనులను గుర్తించి పంచాయతీల తీర్మానం చేశారు. తీర్మానాలు ఇచ్చేటప్పుడు గతంలో చేసిన పనులకు, నిధుల విడుదలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తామని తీర్మానాలు తీసుకున్నారు. తీర్మానాలు చేసిన చోట కాకుండా ఇతర చోట్ల పనులు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ పనులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీడీపీ నాయకులకు ఇవ్వలేదు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని పనులు విజయవాడకు చెందిన ఒకరి పేరుతో, రెండు మండలాల పనులు కర్నూల్‌కు చెందిన మరొకరి పేరుతో ఎమ్మెల్యే రిజిస్ట్రేషన్ చేయించారు. దాదాపు రూ.15 కోట్లకు సంబంధించిన పనులు కావాలంటే వారి వద్ద నుంచి 7-10 శాతం పర్సెంటేజీ చెల్లించి తెచ్చుకోవాలి. అయితే ఈ పనులు చేసినా బిల్లులు వారి ఖాతాల్లోనే జమ అవుతాయి. దీంతో ఒకటి-రెండు మండలాల్లో మాత్రమే నాయకుల మధ్యన ఒప్పందం కుదరడంతో టీడీపీ నాయకులు పనులు మొదలుపెట్టారు. మిగిలిన మండలాల్లో ఇంకా పనులు మొదలు కాలేదు. పంచాయతీల్లో ఉపాధిహామి పథకంలో చేసే పనులు సర్పంచ్‌లకు ఎటువంటి సంబంధం లేకుండా చేయించడంపై సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు పంచాయతీ అకౌంట్‌లో జమ చేసేవారు. పనులు పూర్తయిన తర్వాత సర్పంచ్, సెక్రటరీలు డ్రా చేసి పనులు చేసిన వారికి చెల్లించేవారు. నేడు ఆ అధికారం లేకుండానే చేశారు. ఎప్పటి నుంచో వస్తున్న విధానాన్ని కాలరాసి సర్పంచ్‌లపై చిన్నచూపు చూడటం ఏంటని వారు మండిపడుతున్నారు.

టీడీపీ అయితే ఒకే...

టీడీపీ సానుభూతి పరులు సర్పంచ్‌లుగా ఉన్న పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు, ఎన్ఆర్ఈజీఎస్ బిల్లులు డ్రా చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు ఉన్నచోట ఒక్క రూపాయి డ్రా చేసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారు. అధికారులు అధికారపార్టీ ఒత్తిళ్లకు లొంగి సర్పంచ్‌లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గ్రామాల్లో జరగాల్సిన అభివృద్ధిని అధికారులే అడ్డుకుంటున్నారు.

నిధులున్నా ఖర్చు పెట్టలేని పరిస్థితి..

పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రెండు పర్యాయాలు విడుదలయ్యాయి. అయితే సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు పెట్టుకునే పరిస్థితి లేదు. వచ్చిన నిధులు ఖర్చు పెట్టాలంటే ఎమ్మెల్యేతో చెప్పించాలని మండల స్థాయి అధికారులు సెలవిస్తున్నారు. సొంత ఖర్చు పెట్టుకుని నెలల తరబడి నిధుల కోసం ఎదురుచూపులు చూడాల్సిన దుస్థితి ఏర్పడిందని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా చేసిన పనులకు, పాత పనులకు ఎంబుక్ కూడా చేయనీయకపోవడంతో అయోమయంలో ఉన్నారు. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ సమస్య, తాగునీటి సమస్య, పారిశుద్ధ్య కార్యాక్రమాల నిర్వహణకు సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా వ్యవహరించాలి

- ఎస్పీ ఏఆర్ దామోదర్



వీడియా కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: సైబర్ నేరాలపై గ్రామ, వార్డు స్థాయిలో మహిళా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని, నేరాల నియంత్రణతో పాటుగా అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయడంలో క్రియాశీల పాత్ర పోషించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి గురువారం వీడియా కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పాఠశాలలకు చెందిన విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు, సోషల్ మీడియాలో పరిచయాలు, ఆన్‌లైన్ ప్రేమలు, వేధింపుల విషయాల్లో చట్టాల గురించి వివరించాలని తెలిపారు. మహిళలు, పిల్లలు నేరాలకు గురికాక ముందే అవగాహన కల్పించడం మేలన్నారు. సోషల్ మీడియా వేదికను దుర్వినియోగం చేస్తూ జరుగుతున్న సైబర్ నేరాలపై ముందస్తు జాగ్రతలు తీసుకోవాలన్నారు. ప్రజల అత్యాశ, భయాందోళనలను ఆసరా చేసుకొని వివిధ రకాల మోసాలకు పాల్పడుతున్నారని, వాటిపై మహిళలకు సరైన అవగాహన కల్పించడం ద్వారా ఆ నేరాల బారిన పడకుండా కాపాడాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని, మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత పడేలా చూడాలన్నారు. ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి ప్రభావం ఆయా కుటుంబాలపై తీవ్రంగా ఉంటుందన్నారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపడం నేరమని, ట్రాఫిక్ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రతలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల కేసుల్లో పట్టుపడి పోలీసు రికార్డుల్లో పేరు ఎక్కితే భవిష్యత్‌లో ఉద్యోగాలు రావని, జీవితాలు దెబ్బతింటాయని చెప్పారు. విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండే విధంగా చూడాలన్నారు. మంచి వాతావరణంలో ఆరోగ్యకరమైన జీవనవిధానాన్ని అలవరుచుకోవాలని సూచించారు. గ్రామ స్థాయిలో శాంతి భద్రలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారాన్ని సేకరించి ఉన్నతాధికారులకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కేవీ రాఘవేంద్ర, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా



లాంగ్‌జంప్‌లో విజేతగా నిలిచి బహుమతి అందుకుంటున్న కేబీఆర్ కళాశాల విద్యార్థి

సీఎస్‌పురం(పామూరు): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బాపట్లలో జరిగిన అంతర కళాశాలల క్రీడా సమ్మేళనం క్రీడా పోటీల్లో శీలంవారిపల్లెకు చెందిన కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల రెండో సంవత్సరం విద్యార్థులు సత్తా చాటినట్లు కళాశాల డీన్ డాక్టర్ పి.రఘుపతి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యార్థిని యమున లాంగ్‌జంప్‌లో ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానం సాధించింది. అదేవిధంగా క్విజ్‌లో సత్యదీప్, మనోజ్‌కుమార్‌లు మొదటిస్థానంలో నిలిచారు. గెలుపొందిన విజేతలకు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ జి.కరుణాకర్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు డీన్ తెలిపారు. ఈసందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులను కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కదిరి పార్థసారది, కళాశాల అధ్యాపకులు, సహచర విద్యార్థులు అభినందించారు.

బ్రూసిల్లా వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

- అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



టీకాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ఆడ పశువుల్లో గర్భస్రావానికి, మగ పశువుల్లో కీళ్ల వాపులకు కారణమయ్యే బ్రూసిల్లా వ్యాధి నియంత్రణకు పశు పోషకులు పెయ్య దూడలకు తప్పనిసరిగా వ్యాధి నివారణ టీకాలు వేయించేలా అవగాహన కల్పించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులకు సూచించారు. ప్రకాశం భవనంలో బ్రూసిల్లా వ్యాధి నివారణ టీకాల కార్యక్రమానికి సంబంధించిన అవగాహన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువుల నుంచి మనుషులకు సోకే గుణం ఉన్న ఈ వ్యాధికి జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా నాలుగు నుంచి ఎనిమిది నెలల వయసున్న పెయ్య దూడలకు తప్పక టీకాలు వేయించాలన్నారు. ఒకసారి టీకా వేయిస్తే జీవితకాలంలో వ్యాధి రాదని తెలిపారు. దీనిపై పశుపోషకులకు చైతన్యం కల్పించి టీకాలు కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. టీకాల కార్యక్రమం నవంబర్ 20 నుంచి డిసెంబర్ 19వ తేదీ వరకు జిల్లాలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి బేబిరాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు పాకల విద్యార్థులు ఎంపిక



రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైన పాకల ఉన్నత పాఠశాల విద్యార్థులు

సింగరాయకొండ: రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు 14 మంది పాకల విద్యార్థులు ఎంపికైనట్లు గురువారం ప్రధానోపాధ్యాయుడు డీవీఎస్ ప్రసాద్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 విభాగంలో ఇటీవల సింగరాయకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి జట్ల ఎంపికల సందర్భంగా వీరిని ఎంపిక చేసినట్లు వివరించారు. ఈనెల 23, 24వ తేదీల్లో తిరుపతి జిల్లా రేణిగుంటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్య వివరించారు.

పిచ్చికుక్కల స్వైర విహారం

- ముగ్గురిపై దాడి




కుక్కల దాడిలో గాయపడ్డ షబ్బీర్, సాజిద్

కంభం: పట్టణంలోని అర్బన్ కాలనీలో గురువారం రాత్రి పిచ్చికుక్కలు స్వైర విహారం చేసి ముగ్గురిపై దాడి చేశాయి. మహమ్మద్ సాజిద్ అనే 9 ఏళ్ల బాలుడు, షేక్ షబ్బీర్, మరో బాలిక పై పిచ్చి కుక్క దాడి చేయడంతో వారి చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలో ఇటీవల కాలంలో కుక్కల బెడద తీవ్రమైందని, తరచూ విద్యార్థులను, పాదచారులపై దాడి చేస్తున్నాయని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. గతంలో కంభం పంచాయతీ పరిధిలో కుక్కలను పట్టించిన అధికారులు కందులాపురం పంచాయతీ పట్టకుండా వదిలేశారు. దీంతో బయటకు వెళ్లాలంటే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కుక్కల బెడద నుండి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

సెంట్రింగ్ బాక్సులు చోరీ

- ముగ్గురు అరెస్టు

సింగరాయకొండ: సెంట్రింగ్ బాక్స్‌ల చోరీ కేసులో ముగ్గురిని గురువారం తెల్లవారుజామున పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. ఈ సంఘటన మండల పరిధిలోని బాలాజీ నగర్ జంక్షన్ లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..జరుగుమల్లి మండలం చిర్రికూరపాడు గ్రామం నుంచి ఆటోలో సుమారు రూ.లక్ష విలువైన సెంట్రింగ్ బాక్సులను చోరీ చేసి తరలిస్తున్న కందుకూరుకు చెందిన చిన్న కత్తుల శ్రీను, స్థానికులైన జంగాలపల్లి వంశీ, పెద్దకత్తుల హరిబాబు ముగ్గురిని బాలయోగి నగర్ జంక్షన్ లో తెల్లవారుజామున వాహనాలు తనిఖీ సందర్భంగా ఆటోను ఆపి తనిఖీ చేయగా చోరీ విషయం బయటపడింది. వీరిపై కేసు నమోదు చేసి కనిగిరి కోర్టుకు హాజరు పరచగా జడ్జి వారికి 15 రోజుల రిమాండ్ ఇచ్చినట్లు ఎస్సై బి.మహేంద్ర వివరించారు.

కురిచేడు పోలీసులకు ఎస్పీ అభినందనలు



కురిచేడు పోలీసులను అభినందించిన ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: కాలువలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఒక వృద్ధుడిని కాపాడిన కురిచేడు పోలీసులను ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించి ప్రశంస పత్రాలను అందజేశారు. కురిచేడుకు చెందిన వి. బ్రహ్మారెడ్డి (69) కుటుంబ, ఆరోగ్య సమస్యలతో విసుగుచెందాడు. ఈక్రమంలో ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం కురిచేడు ఎన్ఎస్పీ కెనాల్లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ సమయంలో చూసిన స్థానికులు గట్టిగా కేకలు వేశారు. అది గమనించిన కానిస్టేబుళ్లు విజయ కుమార్, ప్రసన్న బాబు వెంటనే స్పందించారు. ఈతగాళ్లను కాలువలోకి దింపి వృద్ధుడి ప్రాణాలను కాపాడారు. అనంతరం ఆత్మహత్యకు పాల్పడకుండా కౌన్సెలింగ్ నిర్వహించి అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కురిచేడు పోలీసు స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లను గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అభినందించారు.

కనిపించకుండా వెళ్లి.. శవమై తేలాడు

పుల్లలచెరువు: చేతికి అందివచ్చిన కుమారుడు కనిపించకుండా వెళ్లి శవమై తేలాడంతో అతని తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతంగా మారింది. పుల్లలచెరువుకు చెందిన కటారి వెంకటశేషయ్య కుమారుడు బ్రహ్మయ్య(19) ఇంజినీరింగ్ చదువుతూ మానేసి తండ్రికి చేదోడువాదోడుగా ఉంటూ పోలం పనులు చేసుకుంటున్నాడు. కాగా ఈ నెల 11వ తేదీన ఇంటి పనుల నిమిత్తం బయటకు వెళ్లి కనిపించకుండా పోయాడని తండ్రి శేషయ్య ఫిర్యాదు చేసినట్లుగా ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపారు. ఆ రోజు నుంచి బ్రహ్మయ్య.. స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసినా ఫలితం కనిపించలేదు. ఈ నేపథ్యంలో గురువారం మండలంలోని శతకోడు గ్రామ సమీపంలోని అడవిలో ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐతో పాటు బ్రహ్మయ్య బంధువులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. ఆ శవం బ్రహ్మయ్యదిగా నిర్ధారించినట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం యర్రగొండపాలెం వైద్యశాలకు తరలించారు.